కనిపించని 'చెత్త'శుద్ధి!

- ప్రకటనల్లోనే స్వచ్ఛ ఆంధ్ర.. రోడ్లపై ఎక్కడికక్కడ చెత్తే
- కాలువల్లో పారని మురుగు
- జనావాసాల మధ్య పందుల సంచారం



తోటవారి వీధి మెయిన్‌రోడ్డులో అధ్వాన దుస్థితి



పోస్ట్‌మ్యాన్ రామచంద్రరావు వీధిలో కాలువల్లో పేరుకుపోయిన చెత్త

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్ర.. అంటూ ప్రచారాలతో ఓ పక్కన ప్రభుత్వ పెద్దలు ఊదరగొడుతున్నారు.. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. రోడ్లపై చెత్త.. కాలువల్లో కదలని మురుగుతో అధ్వాన పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

58వ డివిజన్‌లో దారుణంగా..

సింగ్‌నగర్ స్మైల్ హాస్పిటల్ రోడ్డు, పీఅండ్‌టీ కాలనీ, సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు, నందమూరి నగర్, తోటా వారి వీధి, ఇందిరానాయక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపైనే ఇష్టం వచ్చినట్లుగా చెత్త వేసేస్తున్నారు. చెత్త వేసే ప్రదేశాలలో డంపింగ్ మిషన్లు ఏర్పాటుచేయకపోవడంతో స్థానిక ప్రజలు ఆ ప్రాంతాలలోని రోడ్లపైనే చెత్తాచెదారాలను పడేస్తున్నారు. దీంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వాటి నుంచి వస్తున్న దుర్వాసన, దోమలు, ఈగలతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయిన్‌లలో కదలని మురుగు..

ఇందిరానాయక్‌నగర్, పీఅండ్‌టీ కాలనీ, వడ్డెరకాలనీ, కేఎల్‌రావురోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్, పైపులరోడ్డు ప్రాంతాల్లోని సైడు కాలువల్లో పూడికలు సరిగా తీయకపోవడంతో ఆ కాలువల్లో చెత్తా, చెదారాలు పేరుకుపోయి మురుగు కదలని పరిస్థితి ఏర్పడింది. కొద్దిపాటి చినుకులు పడినా.. ఏదైనా కాలువకు అడ్డుపడినా ఇక అంతే సంగతులు. ఆ మురుగు నీరంతా రోడ్లపైకి వచ్చేస్తోంది. రోజుల తరబడి మురుగు కాలువల్లోనే ఉండిపోవడంతో అవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

నివాసాల మధ్య పందుల సంచారం..

నిబంధనలకు విరుద్ధంగా పందులు ఇక్కడి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. రోడ్లపై చెత్తా, చెదారాలు ఉన్న ప్రాంతాల్లో.. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలలో పందులు పదుల సంఖ్యలో తిరుగుతున్నాయి. వీటివల్ల ఎప్పుడు ఏ రోగాలు వచ్చి తమను హాస్పిటల్స్ పాలు చేస్తాయోననే భయంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పందులు తిరుగుతున్నాయి..



మా ప్రాంతంలో పందుల సమస్య అధికంగా ఉంది. పదుల సంఖ్యలో పందులు ఇళ్ల మధ్యనే తిరుగుతున్నాయి. వాటి నుంచి ఏ వ్యాధులు ప్రబలుతాయోనని భయంగా ఉంటుంది. సమస్యను సంబంధిత సిబ్బందికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నివాసాల మధ్య పందుల తిరగకుండా చర్యలు తీసుకోవాలి.

– షేక్ నసీర, ఇందిరానాయక్‌నగర్

అధికారులు పట్టించుకోరు..

చెత్తా, మురుగు, పందుల సమస్యలను సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ఉన్నతాధికారులు తమ ప్రాంతాలలో నెలకొంటున్న చెత్తా, మురుగు, పందుల సమస్యలపై చర్యలు తీసుకొని వీటి బారి నుంచి తమకు విముక్తి కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

20న మునిసిపల్ కార్మికుల సమ్మె



33వ డివిజన్ శానిటరీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన ప్రవీణ్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని యూనియన్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్ పిలుపునిచ్చారు. సోమవారం 33వ డివిజన్, సత్యనారాయణపురంలోని శానిటేషన్ కార్యాలయంలో ఆయన పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలకసంస్థలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మునిసిపల్ ఆప్కాస్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎం.మురళీకృష్ణ, మునిసిపల్ యూనియన్ నాయకులు శ్రీనివాసమ్మ, దుర్గ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తమలపాకుల అర్చన



పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కల్యాణం, భారత సైనికుల సంక్షేమం, రక్షణార్థం ముత్యాలంపాడు శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆంజనేయ స్వామివారికి లక్ష తమలపాకుల అర్చన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి, శ్రీ కూర్మజయంతి పురస్కరించుకుని సర్వమానవాళి, భారత సైన్యానికి ఆంజనేయస్వామివారి ఆశీస్సులు లభించాలని కోరుతూ తాము లక్ష తమలపాకుల అర్చన ఏర్పాటు చేశామన్నారు. ప్రజల అభిమానంతో పాటు ఆంజనేయస్వామివారి ఆశీస్సులు మన సైనికులకు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తమలపాకులతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పి. మల్లయ్య పాల్గొని పూజలు చేశారు.

దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

- ఇంజినీరింగ్ అధికారులతో ఈవో సమావేశం
- సమీక్షకు బీజేపీ నేతలు హాజరు



ఇంజినీరింగ్ పనులపై సమీక్షిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై ఆలయ ఈవో శీనానాయక్ సోమవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఆలయ ప్రాంగణంలోని ఈవో చాంబర్‌లో నిర్వహించిన సమీక్షకు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో పాటు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మునిరత్నంరెడ్డి, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ పాండురంగారావు హాజరయ్యారు. ఈ సమావేశానికి బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ హాజరయ్యారు. ఆలయ మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతున్న ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్‌తో పాటు ఇతర అభివృద్ధి పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులు ఈవో శీనానాయక్‌కు వివరించారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో ఎమ్మెల్యే సూచన మేరకు చేపట్టిన మార్పుల గురించి తెలియజేశారు. మాస్టర్ ప్లాన్ వీడియోను ఈవో వీక్షించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి త్రీడి ప్రింట్‌ను సిద్ధం చేయడంతో పాటు ప్రతి నెలా పనుల పురోగతిపై నివేదిక తయారు చేయాలని సూచించారు. సమీక్షలో ఇద్దరు బీజేపీ నేతలు పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు, రిటైర్డ్ ఎస్ఈ ఉదయ్ కుమార్, రిటైర్డ్ ఈఈ నారాయణమూర్తి, డీసీపీ చంద్రబోస్, ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలి



వీఎంసీ కమిషనర్‌ను కలిసిన చైత్రదీపిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో కలిసిన క్రీడాకారిణి చైత్ర దీపికను కమిషనర్ అభినందించారు. ఎన్ఎస్ఎం స్కూల్లో 10వ తరగతి చదువుతున్న చైత్ర ఇటీవల తైవాన్‌లో జరిగిన తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటీషన్స్ భారత జట్టుకు పలు విభాగాల్లో ప్రాతినిధ్యం వహించింది. పెయిర్ స్కేటింగ్ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో కాంస్య పతకం, కపుల్ డ్యాన్స్ విభాగంలో రజత పతకాలు సాధించింది. భారత దేశం తరపున స్కేటింగ్‌లో ఆరు దేశాలకు (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, కొరియా, ఇటలీ, సింగపూర్) దీటైన పోటీ ఇచ్చి మూడు పతకాలు సాధించి దేశానికి ఎంతో పేరు తీసుకొచ్చింది. గతంలో చైనాలో జరిగిన 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ (వరల్డ్ స్కేటింగ్ అసోసియేషన్)లో కూడా భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి, పెయిర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించింది. దక్షిణ కొరియాలో ఈ ఏడాది జూలై 20 నుంచి 30 తేదీ వరకు జరిగే 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌నకు చైత్రదీపిక ఎంపికైనందుకు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

దేశ భక్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి



భోజనాలు వడ్డిస్తున్న నాగేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కుల, మతాలకు అతీతంగా.. అన్ని సంప్రదాయాలు, సంస్కృతులకు ప్రాధాన్యం ఇచ్చే ఏకైక దేశం మన భారతదేశం అని.. ప్రతి ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకోవాలని కల్లే లలితా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కల్లే నాగేశ్వరరావు అన్నారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన ముందుగా పాకిస్తాన్‌తో జరిగిన ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో అమరులైన వీర జవాన్‌లకు.. కల్లే లలితా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టాలనే ఉద్దేశంతో మన శత్రు దేశాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఎవరి మీద జరిగినా.. మన దేశ ప్రజల మీద దాడి జరిగినట్లుగా అందరూ భావించి, ఐక్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక మన దేశం అని కొనియాడారు. అనంతరం స్థానిక నిరుపేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ డైరెక్టర్లు కల్లే సీతా మహాలక్ష్మి, సభ్యులు ముప్పూరి హరీష్, గుద్దిటి కిరణ్, ఎం. అశ్విన్, ధృవన్ తదితరులు పాల్గొన్నారు.

పదకవితకు పట్టాభిషేకం



శోభాయాత్ర నిర్వహిస్తున్న సంగీత విద్వాంసులు





అన్నమయ్యకు నాట్యాభిషేకం చేస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు 617వ జయంతి వేడుకలు రెండో రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం అన్నమాచార్యుల సంకీర్తనలు పాడుకుంటూ సంగీత విద్వాంసులు నిర్వహించిన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. పున్నమ్మతోట టీటీడీ కల్యాణమండపం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర లబ్బీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకుంది. దారిపొడవునా అన్నమయ్యకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. సంగీతోత్సవంలో భాగంగా పోపూరి శ్యామసుందర్, అంజనాసుధాకర్, చింతలపాటి హరిత, లక్ష్మీజయతి, నాగపూజిత, కుందుల అనిల్‌కుమార్, పోపూరి షణ్ముఖ ప్రియ, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల విద్యార్థినులు, అనూష త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. 'శ్వాస' సభ్యులు సత్యబాలు, ప్రసాద్, దుగ్గిరాల శ్రీలత, హాస శ్రీమేధ నిర్వహించారు. దేవాలయంలోని అన్నమాచార్య విగ్రహానికి దేవాలయ మేనేజర్ శర్మ, నిర్వహణ బాధ్యులు డాక్టర్ సి. రామ్మోనరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నమయ్యకు నృత్య నీరాజనం..

అమరావతి శాస్త్రీయ నాట్యాచార్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జీవీఆర్ సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించిన అన్నమయ్యకు నృత్యాభిషేకం కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్ పర్యవేక్షణలో నగరానికి చెందిన నాట్యాచార్యులు, సభ్యులు 200 వందల మంది అన్నమయ్య సంకీర్తనలకు నృత్యాలను అభినయించారు. ఈ సందర్భంగా ఇండోపాక్ యుద్ధంలో వీరమరణం పొందిన వీరజవాన్లకు మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె. లక్ష్మీనరసమ్మ, నాట్యాచార్యుడు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు తదితరులు నివాళి అర్పించారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖ పూర్ణిమ వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైశాఖ పూర్ణిమను పురస్కరించుకొని లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ నాగసాయిబాబా, మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవారికి పూలాభిషేకం చేశారు. లక్ష్మీదేవికి ఇష్టమైన పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి తామర పూలతో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి రోజున లక్ష్మీదేవి, విష్ణువును పూజించడం వల్ల అదృష్టం, శ్రేయస్సులతో పాటు సకల దుఃఖాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. మందిర నిర్వాహకుల ఆధ్వర్యాన భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

విజయ పాల వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయ పాల వాహనం ఢీ కొట్టి వ్యక్తి గాయాల పాలైన ఘటన సితార సెంటర్ వద్ద జరిగింది. వన్‌టౌన్ కేబీఎన్ కళాశాల ప్రాంతానికి చెందిన రాయన శ్రీకాంత్ రైల్వే స్టేషన్‌లో బిర్యాని ప్యాకెట్లు విక్రయిస్తుంటాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో గొల్లపూడి వైపు నుంచి సొరంగం గుండా చిట్టినగర్ వైపు వెళ్తుండగా సితార సర్కిల్ దాటిన తర్వాత విజయ పాల వాహనం కార్తీక్ బైక్‌ను ఢీ కొనడంతో కింద పడిపోయాడు. అతని ఎడమ కాలు విరిగిపోయింది. కుడి చేయి, తలకు గాయాలయ్యాయి. స్థానికులు అతనిని ప్రైవేటు వాహనంలో కొత్త గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కార్తీక్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ చేసిన 43 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 43 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 43 మందిపై 6వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిని రైల్వే కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని పోలీసులు చెప్పారు.

భానుడి కర్ఫ్యూ.. నిర్మానుష్యంగా రోడ్లు



మధురానగర్ వీవీనరసరాజు రోడ్డు ఇలా..



దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు ఇలా..

మధురానగర్(విజయవాడసెంట్రల్): భానుడి ప్రతాపానికి సోమవారం నిత్యం రద్దీగా ఉండే మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, మాచవరం, దుర్గాపురం తదితర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. వేసవి ఉష్ణోగ్రతలు పెరగటంతో ఎండవేడికి నగరవాసులు అల్లాడిపోయారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. రోడ్డుపైకి వచ్చేందుకు వాహన చోదకులు, పాదచారులు సాహసించలేదు. దీంతో రద్దీగా ఉండే రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. ఇప్పటి వరకు అంతంత మాత్రంగా ఉన్న ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వచ్చిన వారు క్యాప్‌లు, గొడుగులు, హెల్మెట్‌లను వినియోగించారు.

నగరాభివృద్ధికి నిరంతర కృషి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం మేయర్ అధ్యక్షతన స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. అజెండాలో 45 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 39 ఆమోదిస్తూ తీర్మానించారు. మూడు అంశాలు ర్యాటిపై చేయగా ఒకటి పరిశీలించాలని, మరొక అంశాన్ని ధ్రువీకరణ చేయాలని ఇంకో అంశాన్ని రికార్డు చేశారు.

ప్రధానాంశాలు..

- వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించే భవనానికి మరొక లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ ప్రతిపాదనను ఆమోదిస్తూ సభ్యులు తీర్మానించారు.
- పటమట 11వ డివిజన్‌లో ఉన్న యలమంచిలి కుటుంబరావు పార్కులో వాకింగ్ ట్రాక్ పెంచాలని, పార్కులో గ్రీనరీ అభివృద్ధి చేయాలని ఇందుకు రూ. 30 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయింపులు చేయాలని తీర్మానం చేశారు.
- వీఎంసీ ఖాళీగా ఉన్న 78 డ్రైవర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న వారికి ప్రమోషన్ ఇవ్వాలని వచ్చిన మెరిట్ జాబితాను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్–3 పరిధిలోని 17వ డివిజన్‌లో కృష్ణానది వరద నివారణకు నిర్మించిన ప్రహరీ వెంబడి నిర్మించిన రివర్‌ఫ్రంట్ పార్కులో గ్రావెల్‌తో గోడ నిర్మించాలని అందుకు రూ. 49.85 లక్షలు మంజూరు చేయాలని తీర్మానించారు.

మ్యాన్‌హోల్స్ సరిచేశారు



సాక్షి ఎఫెక్ట్..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లైన్లు నిండిపోవడంతో వాటి మ్యాన్‌హోల్స్ నుంచి వ్యర్థాలు, మురుగు పైకి పొంగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. సింగ్‌నగర్, న్యూఆర్‌ఆర్‌పేట పరిసర ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ స్థానిక ప్రజల పాలిట శాపంగా మారాయి. ఈ సమస్యలను వివరిస్తూ సాక్షి దినపత్రికలో సోమవారం 'కనెక్షన్ల మీద ఉన్న శ్రద్ధ.. సమస్యలపై ఏదీ?' అనే శీర్షిక వెలువడింది. దీనికి కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి ఆయా సమస్యాత్మక ప్రాంతాల్లో నిండిపోయిన యూజీడీ లైన్లలో ట్యాంకర్లు సహాయంతో మురుగును తొలగించారు. తమ సమస్యలు పరిష్కారం కావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

బాటసారులకు మజ్జిగ పంపిణీ



విజయవాడ కల్చరల్: ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, ఎక్స్‌రే వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 75 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాలలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంజనేయరాజు మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. సంస్థ ద్వారా 25ఏళ్లుగా నగరంలోని పలు ప్రాంతాలలో ఏటా అన్నదానం, మజ్జిగ పంపిణీ, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ కవి ఎంఆర్‌ఎస్ ప్రకాశరావు, మదన్, చామర్తి వెంకట సుబ్బయ్య, గుర్రం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ పేద ముస్లిం మైనార్టీలకు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సూచించారు. సోమవారం కండ్రికలో ఆజాద్ ముస్లిం కమిటీ నగర సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నగర కమిటీ కోశాధికారిగా మహ్మద్ అల్లాబక్షుని నియమిస్తూ నియామక పత్రాన్ని నాగుల్‌మీరా అందజేశారు. సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి మౌలానా సాజిద్ అలీ, నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, సెంట్రల్ యూత్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, 64వ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

15న ప్రత్యేక విద్యుత్ అదాలత్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ డివిజన్‌లోని 16 సెక్షన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏపీసీపీడీసీఎల్ విజయవాడ సర్కిల్ ఆఫీస్ కార్యాలయం రెండో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందన్నారు. విజయవాడ టౌన్ డివిజన్‌లోని 16 సెక్షన్‌లకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు ఈ అదాలత్‌లో తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవలసిందిగా ఆయన కోరారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ జరుగుతున్న సమయంలో ఓ దివ్యాంగుడు కలెక్టర్ కంట పడ్డాడు. కలెక్టర్ లక్ష్మీశ వెంటనే అతని వద్దకు చేరుకున్నారు. నేలపై దివ్యాంగుని ఎదురుగా కూర్చొని సమస్య అడిగి తెలుసుకున్నారు. విజయవాడ పటమట 10వ డివిజన్‌కు చెందిన గద్దె తంబి తన ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ కలెక్టర్‌కు చూపాడు. తాను నడవలేని స్థితిలో ఉన్నానని, తనకు ట్రై సైకిల్ మంజూరు చేయాలని తంబి కలెక్టర్ లక్ష్మీశను కోరాడు. అక్కడ నుంచి తిరువూరు బయలుదేరిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే ట్రై సైకిల్ సమకూర్చాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించిందే తడవుగా గంటలోనే దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కామరాజు మూడు చక్రాల వాహనాన్ని సమకూర్చారు. దానిని జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహం గద్దె తంబికి అందజేశారు. తాను అడిగిన వెంటనే స్పందించి ట్రైసైకిల్ మంజూరు చేసిన కలెక్టర్‌కు లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి కామ్రేడ్ జీఆర్‌కే, రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం క్లాసికల్ చిత్రగీతాలు, హిందీ చిత్రగీతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయనీ గాయకులు రవికుమార్, శేఖర్, మోహన కృష్ణ, పెద్దిరెడ్డి, కోటి, మస్తాన్ వలీ, మోహనలక్ష్మి, నిషిత, ఉషారెడ్డి, దుర్గా నాగమణి తదితరులు పలు చిత్రగీతాలను ఆలపించారు. చిట్టిబాబు, కె. డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభు పాల్గొన్నారు.